# నీళ్ళ తగవు

- తుమ్మేటి రఘోత్తమరెడ్డి

తోక తెగిన కుక్క ఏడ్చినట్టు .. బాయిమీది సైరన్ కూసింది. సమ్మక్క అదిరిపడి మేల్కొంది. ప్రక్క మంచంపై నర్సయ్య నిద్రపోతున్నాడు. "ఆరు గంటల సీటే వున్నట్టున్నది.... నిద్రపాడుగాను...." అనుకుంటూ మంచం దిగింది. దిగి మంచంక్రిందకమ్మిన కోడిపుంజును రెండుచేతుల్తో దొరకపుచ్చుకుని "నీ ఇంట్లపీని గెల్ల.... 'రాను రాను రాజుగుర్రం గాడిద అయినట్టు' రోజూ అయిదింటికే గూసేది ఇన్నొద్దులు-ఆఁ నెరీ అద్వాన్నఁవై పూర తెల్లారిసంక గూత్తాందే....పుంజో....పుంజు" అని విసురుగా బయటకు తెచ్చి పారేసింది. పూర్తిగా తెల్లవారిందని కాబోలు ! పుంజుకాస్తా సిగ్గుపడి రెక్కలు 'టపటప' లాడిస్తూ కోళ్ళతో కల్సిపోయింది.

చుట్టు మట్టు గుడిశెల వారి పొయ్యిలు దాదాపు అయిపోవస్తున్నయ్. "బొగ్గు పొయ్యి అంటేత్తె ఏడ అందుద్ది?" అని అనుకుంటూ గుడిశెలోకి నడిచింది కట్టెల పొయ్యి అంటించింది. బియ్యం కడగడానికి నీళ్ళకోసం చూస్తె కుండల్లో నీళ్ళులేవు. "మాదిగోనికి సెప్పుకరువన్నట్టు బాయి పనోనికి నీళ్ళ కరువు." అని త్రాగే మంచినీరుంటె పోసి బియ్యం కడిగి పొయ్యి మీదుంచింది. "అయినాల్చంగానే అయింది" అంటూ.... ఊడిన సిగముడివేసి....చీరను గోచీ బిగించి,రెండు చేతుల్లో రెండు కుండలు తీసుకుని గుడిశెలోంచి బయటకు వస్తోంటె దర్వాజ 'ఫట్కు' మని తలకు తగిలింది. "దర్వాజింట్ల మన్నువడ" తగిలి తగిలి పానం దీత్తాంది. అనుకుంటూ రోడ్డుకు ఆవల ప్రక్కగా వున్న సూపర్ వైజర్సు క్వార్టర్సుకు పరుగందుకుంది. గుడిశెల్లో ఆడవారంతా....నీళ్ళ మోసుకుంటూ....బొగ్గు పొయ్యిలు ఇళ్ళలోకి తీసుకు వెళ్తూ,వున్నారు. పందులూ, కుక్కలూ అంతకంటె హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నయ్. చీకట్లు పారిపోయినా పొగ చీకట్లు గుడిశెల వదిలిపోలేదు. ఉక్కిరి బిక్కిరి చేసే పొగ వాతావరణం. మాణిక్యం కట్టిన మసిపాతలా తూర్పు ఆకాశం....

ప్రతి క్వార్టర్ గేటులోంచి నీళ్ళకోసం ఆడాళ్ళ వస్తూ పోతూ వున్నారు. కాస్త దూరపు క్వార్టర్‌కి వెళ్తే జనం వుండరని సమ్మక్కకి అనుభవం నేర్పింది. రోడ్డుకి మొదటి వరుస కాకుండా రెండో వరుసలో వున్న హెడ్ ఓవర్ మేస్త్రీ భగవాన్‌రావుగారి క్వార్టర్ కర్రగేటు తెరుచుకొని లోపలికి వెళ్ళింది. ఎవరూ లేరని తట

పటాయించింది. పొయ్యిమీది బియ్యం జ్ఞాపకం వచ్చేసరికి కుళాయికి కట్టివున్న రబ్బరు గొట్టం ఊడబెరికి కుండ కుళాయి క్రింద పెట్టింది. అంతే .... దాదాపు పన్నెండేళ్ళ కుర్రాడొకడు, గోడచాటుకు వున్న కూరగాయ మొక్కల్లోంచి బయటకు వచ్చి చేతులకు అంటిన బురదను దులిపిస్తూ.... "ఏఁవన్న మనిషివేనా ? అడుగుడు లేదు. గిడుగుడు లేదు. పైపు పూడబీకి నీళ్ళు పట్టొన్నవ్!.... తాత సొమ్మున్నట్టు!" అన్నాడు.

"ఆఁ.... అంత సొమ్ము.... కుండెడు నీళ్ళు పట్టుక పోతె ఏఁవైద్ది" పని తొందర కొంత నోటిదురుసు మనిషి, పైగా అడిగింది పిల్లవాడు. పిల్లాడిలో తర తరాల దొరతనపు వారసత్వపు అహంకార వుంది. దానికి ఆ మాత్రపు మాటలు 'అగ్నికి ఆజ్యంపోసినట్టు' అయింది. ఎంతైనా....అప్పుడూ ఇప్పుడూ దొరబిడ్డే !

"ఏఁవైద్దా ?'' అంటూ పరుగున వచ్చి రెండు కుండల్ని ఒక్క తన్ను తన్నాడు. ఊహించని ఈ హఠాత్పరిణామానికి నిశ్చేష్ఠ అయింది సమ్మక్క. పగిలిన కుండ పెంకుల వంక చూసింది. శరీరంలోని రక్తం అంతా ముఖంలోకి వచ్చింది. కళ్ళు తూర్పు ఆకాశంలా ఎరుపెక్కాయి.

"నీ కాళ్ళు కాలిపోనుగదరా.... నీ ఇంట్ల మన్నువడ గదరా.... బంగారంవసోంటి కుండల నాశినం జేత్తివిగదరా.... బొమ్మంజెపోదును కదరా గాడ్దికొడకా !'' అంటూ తిట్లకి లంకించుకుంది. పిల్లాడు దవడలు కరుచుకుని నిలబడ్డాడు, పిల్లాడి తరపున తల్లి వకాల్తా పుచ్చుకుని అంది. "అసలిక్కడికి రమ్మన్నదెవడే ?'' 'రమ్మన్న దెవడే ?' అనేసరికి సమ్మక్క తోక తొక్కిన త్రాచులా లేచింది.

"ఎవడా....? నీ మిండెడు'' అని విస విస నడవసాగింది సమ్మక్క. గేటు దగ్గరికి రాకముందే ఇంట్లోంచి.... "బద్మాష్‌ముండా....ఆగు:....'' అంటూ హెడ్ ఓవర్ మేన్ భగవాన్‌రావుగారు నాలుగు అంగల్లో వచ్చాడు.కొద్దిగా భయపడి నిర్లక్ష్యంగా అలాగే నిలబడింది.

"ఎవడే....? దానిమిండెడా....? మల్లోసారిఅంటె నాలికకోస్తా బాంచోత్" ఆయన హెడోవర్ మేన్ తీర్గనే అన్నాడు.

"మల్ల కోసేటోడు మొలత్తడు" గేటు తెరుచుకొని బయటకువస్తూ అంది సమ్మక్క. కోపం ఆగని భగవాన్‌రావు సమ్మక్కసిగ అందుకున్నాడు. సిగ అందుకొనే సరికి ఏడుస్తూ తిట్లు మొదలెట్టింది. అప్పటికే చుట్టు ప్రక్కల నీళ్ళకోసం వచ్చిన

358

ఆడాళ్ళు గుమికూడారు. డ్యూటీనుంచి ఇళ్ళకు వస్తున్న కార్మికులుకూడ కొందరు గుమికూడారు. మాటమాట పెరిగింది. సహజంగానే క్వార్టర్ల వారంతా ఒకవైపు, గుడిశెల వారంతా ఒకవైపు విడిపోయారు.

"రేపట్నించి ఎవతన్నా నీళ్ళకు ఇటు మొఖాన అత్తెకాళ్ళిరగ్గొడతమ్"

"కుండలు పలగ్గొడుతమ్."

"తన్ని తలెంటికలు కొరిగిత్తం"

గుడిశెలవారికి ఇంకా పూరుకుంటె లాభం లేదనిపించింది.

"సరే! అచ్చినప్పుడు అవన్ని సేత్తురుగాని" అన్నారు.

పట్టి పట్టిగ మాట్లాడితె తల్కాయలెగుర్తాయ్. ఆ(....." అన్నారు. అలా వార్నింగు ఇచ్చేసి గుడిశెలవైపు వచ్చారు. కొందరు "నమ్మక్క దేతప్పు" అన్నారు. పాపం! వాళ్ళకి నీళ్ళు అత్యవసరం.

"అసలు మనగుడిసెల్ల నాలుగు పంపులుంటె-గ వాడు మనల్ను ముట్టుకునెటోడా....?" అన్నదిక్కట సారక్క.

"గవి లేకనే కద! వాల్లిట్టం అచ్చినట్టు సేత్తాండ్రు సేపుతాండ్రు" అంది మరో ఆవిడ.... "గింత మందివున్నా ఏంలాభం?? నాలుగు పంపులు, పెట్టియ్యక పెయిరి." అన్నది ఒకామె మగవాళ్ళనుద్దేశించి.

"ఆ(....గవాల్లే జెట్టి త్తరు....ఈడికి నాలుగుసార్ల ఎజెంటాఫీసుకు దరుకాత్తులు పట్టుకపెయిండ్రు" అన్నారు, "వాడుతీసి గంగల పారేసిండు" అన్నారు నిరసనగా.

ఆలాఅనుకుంటూనే... ఆపూటకు సరిపడా నీళ్ళకోసం దూరంగావున్న బొగ్గు బాయిలమీదికి వెళ్ళారు. వెళ్ళినీళ్ళు తెచ్చుకుంటుంటె.... సూపర్‌వైజర్స్ క్వార్టర్సు లోంచి సూపర్‌వైజర్సు.... సూపర్‌వైజమ్మలు చూస్తే 'పుట్టచెదిరిన చీమల్లా' లేబరు భార్యలు నీళ్ళు మోసుకుంటున్నారు. వాళ్ళకి కసితీరుతున్నట్టు అన్పించింది.

"లంగ్ముండలు అచ్చినోళ్ళచ్చినట్టు కుక్కిన పేన్లోగె నీళ్ళు పట్టుక పోవద్దూ"

"కూలికిఅచ్చి! పాలుగ్గుదిరినట్లు చేస్తే ఏమైద్ది"

"ఇప్పుడుచూడు! సీతమ్మ సెరలు" అన్నారు.

359

"నాల్రోజులు గట్లమోసుకుంటె మదం వంగుద్ది" అనికూడ అన్నారు.

"గప్పుడుగని ....ఇన్రోజులు మన పంపులకు పట్టుకపెయిన సుఖం తెల్వాది"

"రేపు గీయాలకు కుక్కలోల్లె వురికి రాకపోతేసూడు" ఒకామె జోస్యంహాడ చెప్పింది. అలా వాళ్ళ తలోరకంగ అనుకుంటూనేవున్నారు....

వీళ్ళ— పిల్లా ....పీచూ....ముసలీ ముతకా అనకుండా తలోచెంబో,తలోకుండో ఏదిబడితే అది అందుకొని ఆరోజుకుసరిపడా నీళ్ళ మోసుక వస్తున్నారు. "అన్నం కాలేదేం....?"అని గర్‌గుర్‌లాడితే పున్నపళంగ కుంతలు తమ గుండ్లపై పగలడం ఖాయం అనుకొని కొంతమంది కార్మికులు తమతమ బాయిలమీది 'కేంటిన్ల' కేసి దొక్కపై కిల్లేసుకొని పరిగెత్తు తున్నారు.

కొంతమంది ఆడాళ్ళ నీళ్ళమోస్తూ....మోస్తూనే ఓనిర్ణయానికి వచ్చారు- వచ్చిందే తడవు మిగతవారికి చెప్పేశారు కష్టంలో వున్నారు గనుక వెంటనే ఒప్పేసు కున్నారు. అలా ....నీళ్ళ మోసేవారు మోస్తూనే .. వంటలు చేసేవారు చేస్తూనే.... నిర్ణయాన్ని బలపరచారు. ఇందు అందు అనక, సందుగొందులనక ....ఎక్కడ ఏ ఇద్దరు ఆడాళ్ళకల్సినా మాట్లాడే విషయం ఒకటే అయింది. సూపర్‌వైజర్సు క్వార్టర్సుకేసి కోపంగా చూస్తూనే 'ఆసు' కొయ్యల్లా తిరిగారు ఒకరింటికి ఒకరు. ముప్పయ్యేరు జుట్లు కల్సివున్నా....మూడుసిగలు కల్సివుండవని ఏ 'మనువు' మనవడు అన్నాడో గాని....ఇప్పుడు వీళ్ళ ఒక్కటయే తీరుచూస్తే 'కటుక్కున' నాలిగ్గొరుక్కునేవాడు. వెంటనే పార్టీమార్చిన రాజకీయ పక్షిలా రాగంమార్చేవాడు. చీకటి పడేసరిగ్గాని దాధాపు మూడువందల మంది ఆడాళ్ళ సర్వ సన్నాహాలు పూర్తి చేసుకొని యుద్ధంచేసే తీరు, సమయం ప్రకటించిపారేశారు. అప్పుడు ఎవరిళ్లకు వారు ఆరాత్రి ఎంత తొందరగ గడుస్తుందా అని ఆదుర్దపడుతూ వెళ్ళారు.

ఆ రాత్రి బురద గుంటల్లో తగినన్ని నీళ్ళలేకపోవడం చూసి విచారించిన పందులు....'ఏదో ప్రళయం రాబోతుంది' అని అనుకున్నాయి.

అనుకున్నట్టు ఆరోజు కాస్తా ఆలశ్యంగా తెల్లవారినట్లు అన్పించింది. అప్ప టికే—గుడిశెలకి, క్వార్టర్సుకి మధ్యనగల తారురోడ్డుపై నిరంతరం కిరకిరలాడ్తూ వెళ్ళే బొగ్గులారీల శబ్దాలు గుడిశెల దగ్గరకు రాగానే ఆగిపోతున్నాయి. రోడ్డుపై .... ఎదురుగా దృశ్యాన్ని చూస్తూ వెళ్తున్న కార్మికులు 'వారేవా' అనుకుంటున్నారు. రోడ్డుకి అటూఇటూ కిలోమీటరు పొడుగున బొగ్గులారీలు ఆగిపోయినయ్. రావాల్సిన ఎంబాసిడర్‌లు, ఫియట్లు ఒక్కొక్కటి లారీలప్రక్కనుంచి వచ్చి జనసమూహం

360

దగ్గరికి వచ్చి ఆగిపోతున్నాయ్.ఎదురుగా రోడ్డుపై దృశ్యాన్ని చూసి కనుబొమలు ముడి వేస్తున్నాయి. రాగిచెంబు గుండ్లు వినాయకుడి బొజ్జలు. ఆ విధంగా బావుల మేనేజర్లు, డివిజనల్ సూపరింటెండెంట్లు కార్లుదిగి యింకారావాల్సిన ఏజెంటునళ్ళద్దాల కారుకోసం ఎదురు చూస్తున్నారు. ఆ వుదయపు ఎండ వారికి బాధగానే వుంది.

రావాల్సిన దొర రానేవచ్చాడు. అందరి కార్లకంటె ముందుకి వురికించి ఆపాడు డ్రైవరు. మేనేజర్లు, డి. ఎస్‌లు అటు పరుగెత్తినంత పన్చేశారు. ఏజెంటు కారు ఆగటానికిగల కారణంబేఁవిటాయని చూడగా...వందలసంఖ్యలో కుండలూ...బిందెలూ రోడ్డుపై అనంతకోటి లింగాల్లా అగుపించాయి. అపరకాళికల్లా అంతకురెట్టింపు సంఖ్యలో ఆడవాళ్ళువున్నారు. కింది అధికారులని (క్రింది అంటె రోడ్డుపైకాదు) చూసి కారు దిగాడు. దిగి ఆడవాళ్ళవంక చూశాడు. వాళ్ళంతా కలిసి కోపంతో చూసేసరికి కాస్త జడుసుకున్నాడు. జడుసుకోవడానికి కారణం కూడావుంది. ఏఁవంటె? ఆయనకు మరాఠీ, ఇంగ్లీష్ తప్ప మరో భాష మాట్లాడినా, తిట్టినా అర్థంకాదు. కనుక, ప్రక్కనున్న డి. యన్ రామారావ్ వంక 'విషయం ఏఁవిటో' కనుక్కోమన్నాడు. వచ్చిన ఆడాళ్ళని (మూగివున్న) చూస్తూ "ఏఁవిటి మీకు? ఏంకావాలి?" అని ప్రశ్నించాడు. అందుమీదట "నీళ్ళుకావాలి! కన్పించటంలేదూ?..." అని అన్నారు ఆడాళ్ళు.

"నీళ్ళుకావల్సివస్తే...ఇదేంపని...? ఏజెంటాఫీసుకు రావాలి. వచ్చి అప్లికేషన్ పెట్టాలిగాని" అన్నాడు మరో డి.ఎన్.

"అప్లికేషనా...? నాలుగు సార్లు పెట్టింద్రయ్యా...? నాలుగు సార్దుపెట్టింద్రు ఈడికి నాలుగు ఎండ్లాయె...గట్ల అప్లికేసన్లుపెడ్తానేవున్నారు. మేంజూస్తనేవున్నం. పంపులు అచ్చిందిలేదు," అంది ఒకామె.

"ఎట్లనమ్మా నాల్రోజులు ఓపిక పట్టాలి తొందరపడితె ఎట్ల"..అని ఓడి.యన్ అన్నాడోలేదో... ఒకామె 'గఁయ్'.. మంటు ముందుకు వస్తూ ఏజెంటును చూస్తూ.. ఓపికేపట్టావన్నా...బాంచెన్,ఓపిక...అఁ...అదే...?మీరచ్చి నాల్రోజులు గాక ముందే వుండటానికి కోటర్స్లు..." అంటె

"పంటెమీద గాలిపంఖలు" అన్నారు.

"పాయకాండ్లు " అంటె "తానాల అర్రలు" అన్నారు.

"కార్లు...." అంటే- "మోటారుసైకిళ్ళు" అన్నారు.

మరోకామె మరింత కోపంతో ముందుకు వచ్చి...."గట్ల మన్ను, మశానం, దుబ్బ, దూలి అనకుంట ఏదివడితే అది మీకు ఇయ్యొచ్చు గని....అరువమోటుకట్టం సేసినందుకు మాకు బిందెడు నీళ్ళు సౌలత్ సూడరు. ఆఁ" అంది.

"మా మొగలేమొ, తల్లి కడుపులకు పెయినట్టు పుట్టెడు బండ కిందికి పోయి సచ్చిన సావెరుగక, బతికిన బతికెరుగక, నెత్తురు సెంవుటజేసి, లారీలకు లారీలు, వాగిన్లకు వాగిన్లు బొగ్గు తవ్వి తీత్తంటె గింత నెనరు లేదు?"

"నీళ్ళు మోసి.... మోసి మా రైకలు బుజాలమీద సినిగి కాయలు గాసినయ్"

"అదె....? మీ ఇంట్ల పీనుగులెల్ల! మీరే సేత్తాంద్రా బాయిల పని మీ పెండ్లాలె సుఖపడన్నా?" అంటూ ఒకామె కుండతో డి.ఎస్‌ను కొట్టబోయినంత పన్చేసింది.

"పెయిలకు పెయిలు పెట్టి మీకు....మీ పెండ్లాలకు ఆటలాడుకోను, ఈతకొట్టుకోను కట్టించుకోవచ్చుగని మా గుడిసెల్ల గీనాలుగు మంచిళ్ళ పంపులు పెట్టిత్తె మీ సొమ్మంత ఒడుత్తాసుర్ల....?" అంది ఒకామె.

"ఏమిటి....? వీళ్ళంత చెప్పేది" అన్నట్టు ఏజెంటు డి. ఎస్. వంక చూశాడు. 'నీళ్ళకోసం అంటె పంపులకోసం కోప్పడుతున్నారని, ఎడాపెడా తిడుతున్నారని చెప్పే సరికి....'అసలే ఉప్పు చింతపండు పెట్టి తోమిన రాగి చెంబులాంటి ముఖం మరింత ఎరుపెక్కింది.

"వీళ్ళకిప్పుడు పంపులు పెట్టిస్తమని మాటిస్తె....రేపు క్వార్టర్సు కావాలంటారు...." అన్నాడు ఏజెంటు.

"మరిప్పుడు ఇక్కడనుంచి ముందురేమోగాని వెనక్కికూడ వెళ్ళనిచ్చేట్టులేరు" అన్నాడు ఓ మేనేజరు.

మేనేజర్లు, డి.యస్.లు, ఏజెంటు కలిసి అటుబడి, ఇటుబడి తర్జన బర్జనల్ గావించి చివరికి గత్యంతరం లేక "పెట్టిస్తాం" అని ఒప్పేసుకున్నారు.

"అట్లంటె కలువది....రేపుగియాల్లకల్ల పంపులుపొయ్యాలె" అన్నారు కొందరు. "అవును పొయ్యాలె" అన్నారు అందరు.

"ఇప్పుడంటె ఇప్పుడెట్ల అయితది....? దప్పి అయినప్పుడే బొ[illegible]తవ్వుకుంటామా....? ఓ నాల్రోజులు ఓపిక పట్టండి. సర్వేవాళ్ళు రావాలె, కొలతలు

తీసుకపోవాలె. పైపులు పంపిస్తే అప్పుడు ఫిట్టర్సు వచ్చి ఫిట్ చేస్తేగాని నీళ్ళురావు. ఎట్ల తొందరపడితే? ఉడికేంతవరకు ఆగినోళ్ళు చల్లారేంతదాక ఆగలేరా....?" అంటు ఓ మేనేజరు లౌక్యంగా మాట్లాడాడు. ఆడవాళ్ళంత ఒకరినొకరు చూసుకున్నారు. "సరె"నంటె "సరె" అనుకున్నారు. "మాటతప్పితె మాత్రం మర్యాదదక్కదు" అని ఆఖరుసారిగా చెప్పేశారు. "ఓకే. అమ్మా ఒప్పుకుంటున్నాం కద" అంటు కార్లెక్కారు.

అప్పుడు రోడ్డుమీది కుండలు 'గుసగుస' నడిచాయి. కార్లు నిరసంగా కదిలాయి....అలా మూడొందలమంది ఆడాళ్ళు కలిసి నీళ్ళు సాధించుకున్న వైనం వేలాది కార్మికులకి కార్మికుల భార్యలకి గొప్ప ఉత్తేజం ఇచ్చింది.

రెండో రోజు తెల తెల వారుతోంది....'బుడ....బుడ' చప్పుడు చేస్తూ పంపుల్లోంచి నీరు వస్తుంటె....ఆడాళ్ళ కళ్ళల్లో విజయగర్వం....పరుచుకుంటున్న వెలుగులాగ.....

★

# సవరణ

గత సంచికలో అనివార్యమైన సాంకేతిక ఇబ్బందులవల్ల ఎన్నో తప్పులు దొర్లాయి. ముఖ్యంగా చివరి అట్టమీద 'సృజన వద్ద దొరికే పుస్తకాలు' అని ప్రచురించబడడానికి బదులు 'సృజన ప్రచురణలో కొత్తపుస్తకాలు' అని ప్రచురించబడింది. ఆ జాబితాలో సృజన ప్రచురణలు మాత్రమే కాక క్రాంతి ప్రచురణలు, ఏ. బి. సి. ప్రచురణలు కూడా ఉన్నాయి. ఈ పొరపాటుకు క్షమించవలసిందిగా ఆయా ప్రచురణ కర్తలకు, పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

—'సాహితీమిత్రులు'